నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | మంగళవారం 21 మే 2024 | MAHABUBABAD




మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన హరితహారం మొక్కలు



నర్సింహాపురం బంజర పల్లెప్రకృతి వనంలో తాగి పడేసిన బీరు సీసాలు

# ప్రకృతి వనం కళావిహీనం

**కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య ఫలితం**

- ఎండిన మొక్కలు.. ఖాళీ బీరు సీసాలు.. ఆహ్లాదం ఆవిరై.. అధ్వానంగా పరిసరాలు

*తీరొక్క పూలమొక్కలు, పచ్చని చెట్లతో కళకళలాడిన పల్లె ప్రకృతి వనాలు.. ఇప్పుడు ఎండిపోయిన మొక్కలు, ఖాళీ బీరు సీసాలతో అధ్వానంగా మారాయి. కేసీఆర్ సర్కారు ప్రతి జీపీలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ వనాలను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడంతో ఆహ్లాదం ఆవిరై, మందుబాబులకు అడ్డాలుగా మారాయి. ఒకప్పుడు ప్రీ వెడ్డింగ్ షూట్‌లు చేసిన ఈ హరిత వనాలు ఇప్పుడు చెత్తాచెదారం నిండి కళావిహీనమయ్యాయి. ఇవి మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని బొజ్జన్నపేట, నర్సింహాపురం బంజరలో కనిపించిన దృశ్యాలు. నిర్వహణ లేక, నీటి సౌకర్యం కల్పించక మొక్కలు ఎండిపోయి, పెద్దలు వ్యాయామం చేసేందుకు, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఉన్నా వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది.*

*- నర్సింహులపేట, మే 20*



నర్సింహులపేట మండలం నర్సింహాపురం బంజర పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

# గెలుపే లక్ష్యంగా..

**'ఎమ్మెల్సీ ప్రచారం'లో దూసుకుపోతున్న బీఆర్ఎస్**

- రేపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాక
- మూడు నియోజకవర్గాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై సన్నాహక సమావేశాలు





*వరంగల్ - ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ దూసుకెళ్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రచారం జోరందుకోగా అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించారు. రేపు(బుధవారం) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ తూర్పు, పశ్చిమ, నర్సంపేటలో నిర్వహించే సమావేశాలకు హాజరై ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి విజయం చేకూర్చే దిశగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు.*

*- వరంగల్, మే 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

వరంగల్- ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రచారం జోరందుకున్నది. మొదటినుంచీ బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఈ ఉన్న సెగ్మెంట్‌లో మరోసారి విజయం లక్ష్యంగా గులాబీ పార్టీ వ్యూహాలు అమలు చేస్తున్నది. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇతర జిల్లాల బీఆర్ఎస్ నేతలను సమన్వయకర్తలుగా నియమించింది. ప్రచార ప్రక్రియను ముమ్మరం చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్సీ ప్రచారం కోసం బుధవారం వరంగల్, హనుమకొండ జిల్లాలకు వస్తున్నారు. నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్ల సమావేశాల్లో పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో, కొత్త రాష్ట్రంలో బీఆర్ఎస్ పాత్రను వివరిస్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను, ముఖ్యంగా నిరుద్యోగులను మోసం చేసిన పద్ధతిని అందరికీ తెలియజెప్పనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఉదయం 11గంటలకు నర్సంపేట నియోజకవర్గంలో, మధ్యాహ్నం 2గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలో, సాయంత్రం 4 గంటలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో పాల్గొంటారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి బీఆర్ఎస్ గెలుస్తున్నది. 2007లో జరిగిన మొదటి ఎన్నికలో ఈ స్థానంలో టీఆర్ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ ఎన్నికయ్యారు. 2009లో జరిగిన ఉప ఎన్నికలోనూ కపిలవాయి దిలీప్‌కుమార్ బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచారు. 2015, 2021 జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఇప్పుడు ఉప ఎన్నిక జరుగుతున్నది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి.

## అగ్నికి హరితహారం చెట్లు ఆహుతి

శాయంపేట, మే 20 : మండలంలోని ఆరెపల్లి-ఆత్మకూరు దారిలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా హరితహారంలో పెంచిన చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వ్యవసాయ వ్యర్థాలను రోడ్ల పక్కన పోసి ఉంచడంతో గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టడంతో హరితహారం చెట్లు మంటల్లో కాలిపోయాయి. ప్రయాణికులకు నీడ కల్పించేందుకు రోడ్ల పక్కన కొన్నేళ్లుగా చెట్లను పెంచుతున్నారు. అయితే వీటిని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో రోడ్ల పక్కన మంటలు అంటుకొని చెట్లు ఆహుతవుతున్నాయి. గతంలో కూడా మైలారం పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన చెట్లు కాలిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా పచ్చదనాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నిప్పంటించడంతో కాలిపోతున్న హరితహారం చెట్లు



ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ విప్ బాల్క సుమన్

# సంస్కారవంతుడికి, నయవంచకుడికి పోటీ

- కొట్లాడే గొంతుక రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి
- మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్

నయీంనగర్, మే 20 : ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంస్కారవంతుడు, సమాజ సేవకుడు, బిట్స్ పిలానీ గోల్డ్ మెడలిస్ట్ రాకేశ్‌రెడ్డికి, నయవంచకుడు, పూటకో పార్టీ మార్చి ఓ యూట్యూబ్ చానల్ ద్వారా పీడిత ప్రజల రక్తం తాగే చింతపండు నవీన్‌కు పోటీ జరుగుతున్నదని మాజీ విప్ బాల్క సుమన్ పేర్కొన్నారు. కేయూ బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యార్థులతో ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంస్కారహీనుడు చట్టసభల్లోకి వెళ్తే ప్రమాదకరమని, విషయ పరిజ్ఞానం కలిగిన సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రభుత్వం మెడలు వంచి పట్టభద్రుల సమస్యలను పరిష్కరిస్తాడని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొట్లాడే గొంతుక బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కేయూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలని కోరారు. వరంగల్-నల్లగొండ-ఖమ్మంలోని 34 నియోజకవర్గాల్లోని విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కందుకూరి ప్రభాకర్, పాలమాకుల కొమురయ్య, దామోదర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, కార్యదర్శి సూర్యకిరణ్, రాజేశ్‌నాయక్, జిల్లా కోఆర్డినేటర్ అరూరి రంజిత్, బైరపాక ప్రశాంత్, కేయూ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, యూనివర్సిటీ నాయకులు గొల్లపల్లి వీరు, కొనుకటి ప్రశాంత్, పిన్నింటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## నేడు కేయూకు విజిలెన్స్ కమిటీ

**నేటితో ముగియనున్న వీసీ రమేశ్ పదవీకాలం**

హనుమకొండ చౌరస్తా, మే 20 : కేయూ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేశ్‌పై వస్తున్న అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిటీ మంగళవారం యూనివర్సిటీకి రానున్నట్లు సమాచారం. ఈ నెల 21న వీసీ పదవీ కాలం ముగియనుండటంతో ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టనున్నారు. రమేశ్ 2021 జూన్ 24న వీసీగా బాధ్యతలు స్వీకరించారు. వీసీగా నియామకం జరిగినప్పటి నుంచే వివాదాలు మొదలయ్యాయి. కేయూలోని కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతంతో పాటు అధ్యాపకుల నియామకాల్లో అక్రమాలు, పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు, అధిక మెస్ బిల్లులతో పాటు ఆర్ట్స్‌కాలేజీ ఫీజుల నిధుల మాయంపై విచారణ చేపట్టనున్నారు. వీసీ పదవీ కాలం ముగియనుండటంతో వర్సిటీకి మంచిరోజులు రాబోతున్నాయని విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు.



**చెట్టులెక్కగలను.. చిగురు కోయగలను!**

వేసవి కాలంలో చింత చిగురుకు మస్తు డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కిలోకు మార్కెట్‌లో రూ.700 వరకు పలుకుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి వనరుగా మారింది. డోర్నకల్ మండలం చిల్కోడు గ్రామ శివారులో ఓ మహిళ చెట్టు ఎక్కి చిగురు తెంపుతుండగా 'నమస్తే' క్లిక్ మనిపించింది.

– ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

## చీర కట్టి.. బైక్‌పై చక్కర్లు కొట్టి

- నగర వీధుల్లో యువతి రైడ్..
- ఆసక్తిగా వీక్షించిన జనం.. వీడియో వైరల్



హనుమకొండ చౌరస్తా, మే 20 : నగరంలో ఓ యువతి చీర కట్టులో స్పోర్ట్స్ బైక్‌పై చక్కర్లు కొట్టింది. బైక్‌పై రయ్‌మంటూ నగరవీధుల్లో దూసుకెళ్లింది. వరంగల్ నుం చి హనుమకొండ రోడ్డులో తిరుగుతూ అందరినీ ఆశ్చర్యపరిచింది. చీర కట్టుకుని హెల్మెట్ పెట్టుకుని ఆమె బైక్ నడుపుతుంటే ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కొందరు వాహనదారులు ఆసక్తిగా తిలకించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అంతేకాకుండా ఆ యువతి ముఖానికి మాస్కు, హెల్మెట్ ధరించి రాత్రివేళ పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్ పోయించడం, బైక్‌పై చక్కర్లు కొట్టే వీడియోలు జెట్టీ బైకర్ గర్ల్ పేరిట ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది.

## వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో జీవన్‌జీ దీప్తి రికార్డు




హనుమకొండ చౌరస్తా, మే 20 : జపాన్‌లో ఈ నెల 17 నుంచి ప్రారంభమైన కోబ్-2024 పారా అథ్లెటిక్స్ వరల్డ్ చాంపియన్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా అమ్మాయి జీవన్ జీ దీప్తి వరల్డ్ రికార్డ్ క్రియేట్ చేసి గోల్డ్ మెడల్ సాధించిన మొదటి అథ్లెట్‌గా నిలిచింది. ఉమెన్స్ టీ - 20 కేటగిరి 400 మీటర్ల పరుగులో కేవలం 55.07 సెకండ్స్‌లో పూర్తిచేసి బంగారు పతకం సాధించింది. 2024 పారిస్‌లో జరిగే పారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించి కేవలం 20 సంవత్సరాల వయసులోనే అతిపెద్ద మైలురాయిని అందుకుంది. ప్రపంచ రికార్డు క్రియేట్ చేసి తెలంగాణకు పేరు తీసుకువచ్చిన దీప్తిని పారా స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా, పారా స్పోర్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ గడిపెల్లి ప్రశాంత్, కోచ్ నాగపురి రమేశ్, ప్రెసిడెంట్ సింగారపు బాబు అభినందించారు.

# ఏసీబీ వలలో అవినీతి అధికారి

- రూ.5వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కమలాపూర్ తహసీల్దార్, ధరణి ఆపరేటర్
- భూపాలపల్లి నుంచి బదిలీ అయినా మారని తీరు
- ఎట్టకేలకు చిక్కిన రెవెన్యూ అధికారి

కమలాపూర్, మే 20 : రూ.5 వేల లంచం తీసుకుంటూ కమలాపూర్ తహసీల్దార్ మాధవి, ధరణి ఆపరేటర్ రాకేశ్‌లు ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా సోమవారం పట్టుబడ్డారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్ కన్నూరు జీపీ పరిధిలోని రాములపల్లి గ్రామానికి చెందిన కాసరబోయిన గోపాల్ తన తండ్రి రాజయ్య పేరిట ఉన్న వ్యవసాయ భూమిలో మూడెకరాల 2గుంటల భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఈ నెల 10న తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. రిజిస్ట్రేషన్ ఫైల్ చూడకుండానే తహసీల్దార్ వారిని పంపించింది. ఈ నెల 18న గోపాల్ మళ్లీ వెళ్లాడు. రూ.6వేలు ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పడంతో డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని గోపాల్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు తహసీల్దార్ రూ.5వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ రూ.4వేలు, ధరణి ఆపరేటర్ రూ.1000 తీసుకుంటూ చిక్కారు. వారిని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు వెల్లడించారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన తహసీల్దార్ మాధవి, ధరణి ఆపరేటర్ రాకేశ్

**డబ్బు వసూలే లక్ష్యం..**

తహసీల్దార్ మాధవి డబ్బులు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నది. భూపాలపల్లి జిల్లా నుంచి కమలాపూర్‌కు బదిలీపై వచ్చినప్పటి నుంచి కార్యాలయ సిబ్బంది సైతం అవినీతికి పాల్పడడం మొదలుపెట్టారు. తహసీల్దార్ నేరుగా డబ్బులు డిమాండ్ చేయడం, సిబ్బందితో వసూలు చేయిస్తూ సొమ్ము చేసుకుంది. జిల్లాకేంద్రానికి సమీపంలో ఉండడంతో అంబాల, కమలాపూర్, శ్రీరాములపల్లి, గూడూరు తదితర గ్రామాల్లో భూముల ధరలు పెరిగాయి. మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేశారు. వెంచర్ల నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తు పెట్టుకున్న రియల్ వ్యాపారుల నుంచి లక్షలు వసూలు చేసిందనే ఆరోపణలున్నాయి. పైసలు ఇవ్వనిదే ఫైలుపై సంతకం చేసేది కాదని తెలిసింది. ధరణిలో తప్పుల సవరణ చేసుకునేందుకు దరఖాస్తు పెట్టుకున్న రైతుల నుంచి ఫైలుకు కొంత చొప్పున వసూలు చేసిందనే విమర్శలున్నాయి. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సెల్‌ఫోన్లకు డిజిటల్ పేమెంట్‌ల నుంచి వాటాలు తీసుకునేదనే ఆరోపణలున్నాయి. పహాణీ, ఫ్యామిలీ సర్టిఫికెట్, ఇలా ఏ సర్టిఫికెట్ కావాలన్నా డబ్బులు ఇవ్వనిదే సిబ్బంది పనిచేయడం లేదు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి సైతం కార్యాలయ సిబ్బంది డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

**పది రోజులుగా తిప్పకుంది : గోపాల్**



గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కోసం పదిరోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంది. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వస్తే డబ్బులు డిమాండ్ చేసింది. గిఫ్ట్ రిజిస్ట్రేషనే కదా మేడం అంటే గిఫ్ట్ అయినా ప్రాసెస్ కోసం కావాలని రూ.6వేలు ఇవ్వమంది. అంత ఇవ్వలేనంటే రూ.5వేలు అడగడంతో ఏసీబీకి ఫోన్ చేశా.